క్లుప్తంగా

సైదాపురం ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ


వాసు

సైదాపురం: మండల ఎస్‌ఐగా సీహెచ్‌ వాసు శనివారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా సంతపేట పోలీస్‌స్టేషన్‌ ఎస్‌ఐగా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు.

సిద్దేశ్వరుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

సైదాపురం: మండలంలోని కలిచేడులో వెలసిన కామాక్షిదేవి సమేత సిద్ధేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఈ నెల 8వ తేదీ వరకు బ్రహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు దేవదాయశాఖ కార్యనిర్వాహకులు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆదివారం ధ్వజారోహణం జరుగుతుందన్నారు. సోమవారం నంది వాహన సేవ, మంగళవారం ఉదయం గజవాహనం సేవ, స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి పనుల్లో ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీఓ

దక్కిలి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని గూడూరు క్లస్టర్‌ ఏపీడీఓ వరప్రసాద్‌ అన్నారు. డక్కిలి మండలంలో 4 వేల మందికి తగ్గకుండా ఉపాధి పనులు కల్పించాలన్నారు. డక్కిలి ఉపాధిహామీ కార్యాలయంలో శనివారం ఫీల్డ్‌ అసిస్టెంట్‌లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కూలీలకు రూ.257 తగ్గకుండా వేతనం వచ్చేలా పనులు చేయించాలని సూచించారు. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపాలన్నారు.

గురుపూర్ణిమ వేడుకలు ప్రారంభం

నాయుడుపేటటౌన్‌: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో వెలసిన షిరిడీ సాయిబాబా మందిరంలో 45వ వార్షికోత్సవం, గురుపూర్ణిమ వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాబాకు అభిషేకాలు, పుష్పాలంకరణ చేశారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం భక్తి గీతాలాపన జరిగింది. రాత్రి నిర్వహించిన ఇంద్రజాల ప్రదర్శన, టాకింగ్‌ డాల్‌, మిమిక్రీ, సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కోటూరు సాయిరామ్‌ ప్రసాద్‌, ఉభయదాతలు పాల్గొన్నారు.

90 శాతం పింఛన్ల పంపిణీ


జగనన్న సురక్షపై సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్

నాయుడుపేటటౌన్‌: మున్సిపాలిటీ పరిధిలో శనివారం సాయంత్రానికి 90 శాతానికి పైగా పింఛన్లను పంపిణీ చేసినట్లు కమిషనర్‌ శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 4,222 లకు గాను 3,992 పంపిణీ చేశామని చెప్పారు. కొన్ని సచివాలయాలకు సంబంధించి వెల్ఫేర్‌ కార్యదర్శులతో పాటు అడ్మిన్‌ సెక్రటరీలు పింఛన్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఈకేవైసీ పూర్తి చేయాలి


జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌

వెంకటగిరిరూరల్‌(బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలో పెండింగ్‌లో ఉన్న రైతుల ఈకేవైసీలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌ అన్నారు. బాలాయపల్లి సచివాలయంలో శనివారం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈకేవైసీ వేయని రైతులు ఆర్‌బీకే వద్దకు వెళ్లి గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద ఈకేవైసీ నమోదు చేసుకోవాలని సూచించారు. వేయించుకోని రైతులకు ప్రభుత్వం నుంచి నగదు జమ కాదని తెలిపారు. ఈ మేరకు సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఏడీఏ ధనంజయరెడ్డి, నాగార్జునసాగర్‌, ఏఓ శిరీష, ఏఈఓ సుధాకర్‌ పాల్గొన్నారు.

రేపు పౌర్ణమి గరుడ సేవ

తిరుపతి కల్చరల్‌: పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం తిరుపతిలోని గోవిందరాజస్వామి వారి గరుడసేవ వేడుకగా జరుగనుంది. ప్రతి నెలా పౌర్ణమి పర్వదినాన గరుడ సేవ నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు గోవిందరాజస్వామి వారు గరుడుని అధిరోహించి ఆలయ ప్రధాన వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

సత్వర సేవల కోసమే జగనన్న సురక్ష

- ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు
- అవసరమైన ధ్రువీకరణ పత్రాలు
- వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి


వెంకటగిరి: మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, పక్కన కలెక్టర్‌ వెంకటరమణారెడ్డి


సూళ్లూరుపేట: మన్నారుపోలూరు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

వెంకటగిరి: పేదలకు సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకాన్ని ప్రారంభించారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం వెంకటగిరిలోని బంగారుపేట సచివాలయంలో కలెక్టర్‌ వెంకటరమణారెడ్డితో కలిసి జగనన్న సురక్ష పథకం క్యాంప్‌లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్న తొలి ప్రభుత్వం తమదేనన్నారు. జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి న్యాయం చేయడంతో పాటు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌, కమిషనర్‌ రామయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌ దొంతుశారద, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, నాయకులు కాసుల శివకుమార్‌, పులిప్రసాద్‌రెడ్డి, ఢిల్లీబాబు, రాధ, సుబ్బారావు, సుజాత పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారం

వెంకటగిరిరూరల్‌(బాలాయపల్లి): సమస్యల సత్వర పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమని కలెక్టర్‌ వెంకటరమణారెడ్డి తెలిపారు. బాలాయపల్లి మండలం మన్నూరు న్యూ గ్రామంలో ఆయన పర్యటించారు. మన్నూరు సచివాలయం పరిధిలో 612 మంది దరఖాస్తు చేసుకోగా 580 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వలంటీర్ల ద్వారా సచివాలయంలో వివరాలు నమోదు చేసుకుంటే వెంటనే పథకాలతో పాటు సర్టిఫికెట్లు మంజూరు చేస్తామన్నారు. మన్నూరు గ్రామంలో తాగునీటి సమస్యను గ్రామస్తులు కలెక్టర్‌ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కలెక్టర్‌ గ్రామంలో ఆర్‌ఓ ప్లాంట్‌ ఏర్పాటు చేయాలని ఆర్డీఓను ఆదేశించారు.

అర్హతే ప్రామాణికం..పేదరికమే కొలమానం

సూళ్లూరుపేట: అర్హతే ప్రామాణికంగా పేదరికం నిర్మూలనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తుంటే యువ గంగాళం పప్పుబాబు విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారు పోలూరు సచివాలయం పరిధిలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్లను అందజేశారు. పేదరికం నిర్మూలనంటే ఒక రోజులో జరిగేది కాదని, దాన్ని దశల వారీగా తరిమేసేందుకు జగనన్న వలంటీర్‌, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రతి ఇంటిని జల్లెడ పట్టి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో అవినీతి, అక్రమాలు చేశారే తప్ప ఒక్క పేదవాడికి ఉపయోగపడ్డారా! అని ప్రశ్నించారు. ఆర్డీఓ చంద్రముని, కమిషనర్‌ నరేంద్రకుమార్‌, మున్సిపల్‌ చైర్మన్‌ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైస్‌ చైర్మన్లు పోలూరు పద్మ మిల్టన్‌, చిన్ని సత్యనారాయణ, తహసీల్దార్‌ రవికుమార్‌, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దొరవారిసత్రం/పెళ్లకూరు: దొరవారిసత్రం మండలం నెలబల్లి, పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు గ్రామంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. అర్హత ఉండి ఏమైనా లోపం కారణంగా సంక్షేమ పథకం అందని లబ్ధిదారులను గుర్తించి న్యాయం చేస్తామన్నారు.

నాయుడుపేటటౌన్‌: నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని భరత్‌ నగర్‌ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే కలివేటి మాట్లాడారు. ఎన్నికల ముందు సీఎం ఇచ్చిన హామీలను 99 శాతం వరకు నేరవేర్చారన్నారు. మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ కటకం దీపిక, కమిషనర్‌ శ్రీనివాసరావు, రవికుమార్‌, తహసీల్దార్‌ రాజేంద్ర పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గూడూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష ప్రారంభించారని ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ అన్నారు. స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలో ప్రజలకు పలు రకాల సర్టిఫికెట్లను అందజేశారు. నూటికి నూరు శాతం పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు తీసుకొచ్చారన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ పొనకా దేవసేనమ్మ, కమిషనర్‌ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదవాడికి రక్ష

కోట: జగనన్న సురక్షతో గ్రామాల్లోని సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం అవుతాయని డీఎల్‌పీఓ గూడూరు వెంకటరమణ తెలిపారు. కొక్కుపాడులో వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపామన్నారు.


బాలాయపల్లి: చిన్నారికి బర్త్‌సర్టిఫికెట్‌ అందజేస్తున్న కలెక్టర్‌


దొరవారిసత్రం: నెలబల్లిలో వివాహ సర్టిఫికెట్‌ అందజేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు


గూడూరు: సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్సీ


రాపూరులో జెడ్పీ సీఈఓ చిరంజీవి

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

రాపూరు: జనన్న సురక్ష వల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని జెడ్పీ సీఈఓ చిరంజీవి అన్నారు. రాపూరు పంచాయతీ సైదాదుపల్లి సచివాలయంలో వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు.

సైదాపురం: మండలంలోని అనంతమడుగు, చాగణం రాజుపాళెం గ్రామాల్లో నెల్లూరు జిల్లా పరిషత్‌ సీఈఓ చిరంజీవి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మండలంలో 1260 అర్జీలు వచ్చాయన్నారు. వాటిలో 1060 సమస్యలకు పరిష్కారం చూపామన్నారు.

కలువాయి/దక్కిలి: కలువాయి మండలం పెన్నబద్వేలు, చీపినాపి సచివాలయాలు, డక్కిలి మండలం డి.వడ్డిపల్లి సచివాలయల్లో జరిగిన కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్‌ రెడ్డి, జేసీఎస్‌ మండల ఇన్‌చార్జీ చింతల శ్రీనివాసులు రెడ్డి మాట్లాడారు.

పీఎం కిసాన్‌కు ఈకేవైసీ తప్పనిసరి


మాట్లాడుతున్న ఏడీఏ ఉమ

నాయుడుపేట: ప్రధానమంత్రి కిసాన్‌ యోజనకు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఉమ అన్నారు. నాయుడుపేట ఏడీఏ కార్యాలయంలో శనివారం సబ్‌ డివిజన్‌ పరిధిలోని మండలాల వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. వైఎస్సార్‌ యాప్‌లో పీఎం కిసాన్‌, కౌలుదారుల కార్డులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈకేవైసీ చేసుకోని పక్షంలో రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్‌ నగదు జమకాదన్నారు. ప్రతి ఆర్‌బీకే పరిధిలో వీవీఏఎస్‌లు కౌలుదారులను గుర్తించి కార్డులు మంజూరు చేయాలని తెలిపారు. కోట, వాకాడు, నాయుడుపేట, చిట్టమూరు, నాయుడుపేట, పెళ్లకూరు మండలాలకు చెందిన వ్యవసాయశాఖ అధికారులు గణేష్‌, ప్రవీణ, సుచేంద్రప్రసాద్‌, నిరంజన్‌, దీప, అనురాధ పాల్గొన్నారు.

కమనీయం.. నరసింహుని కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న భక్తులు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహాస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో వేకువజామున శ్రీవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. అనంతరం దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి నిత్య కల్యాణమండపంలో కొలువుదీర్చారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. రాత్రి 7 గంటలకు ఊజంల్‌సేవ నిర్వహించారు.

విద్యార్థినులకు నగదు ప్రోత్సాహం


నగదు ప్రోత్సాహం అందుకున్న విద్యార్థినులతో ఉపాధ్యాయులు

చిల్లకూరు: పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థినులకు నెల్లూరు ధనలక్ష్మీపురానికి చెందిన శివసాయి సూపర్‌ మార్కెట్‌ యాజమాన్యం శనివారం నగదు ప్రోత్సాహకాలను అందించింది. తీర ప్రాంతంలోని వరగలి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మొదటి స్థానం సాధించిన మానసకు రూ.5 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన లోహిత, వైష్ణవిలకు రూ.3 వేలు, రూ 2. వేల చొప్పున నగదు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మరుదవతి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులను నగదు బహుమతులతో ప్రోత్సహించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సూపర్‌ మార్కెట్‌ నిర్వాహకులు పంచాక్షరి మల్లికార్జున్‌, సీఆర్‌పీ ఏడుకొండలు పాల్గొన్నారు.

వైభవం.. ఆలయ వార్షికోత్సవం




స్వామివారి కల్యాణోత్సవంలో భక్తులు, గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు

రాపూరు: రాపూరు సమీపంలోని మద్దెలమడుగు వద్ద ఉన్న మహావిష్ణువు, అయ్యప్పస్వామి ఆలయాల ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, పూలంగి సేవ, శ్రీదేవి, భూదేవి సమేత మహావిష్ణువు కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్ర ఉత్సవమూర్తులను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అసాంఘిక కార్యకలాపాలు చేపడితే చర్యలు


స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు

చిల్లకూరు: చిల్లకూరులోని మిక్స్‌డ్‌ కాలనీలో ఓ మహిళ అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తోందని స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం సాయంత్రం ఆ ప్రాంతంలో కొంత ఉద్రిక్తత నెలకొంది. సీఐ దశరథరామారావు, ఎస్‌ఐ గోపాల్‌ స్థానిక మహిళలతో మాట్లాడారు. కాలనీలో కొత్తగా అద్దెకు ఉంటున్న మహిళ ఇతర ప్రాంతాల నుంచి కొంత మంది యువతులను తీసుకొస్తోందని.. వారు రాత్రి సమయాల్లో తిరుగుతుండడం వల్ల ఇబ్బందిగా మారిందని అన్నారు. దీంతో పోలీసులు ఆ మహిళను పది రోజుల్లోగా ఈ ప్రాంతంలో ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని హెచ్చరించారు.

సామూహిక అక్షరాభ్యాసం


విద్యార్థులకు అక్షరాలు దిద్దిస్తున్న హెచ్‌ఎం

చిల్లకూరు: ఓడూరు పంచాయతీ పరిధిలోని పున్నపువారిపాళెం ప్రాథమిక పాఠశాలలో శనివారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కొత్తగా పాఠశాలలో చేరిన ఒకటో తరగతి విద్యార్థులకు తల్లిదండ్రుల కోరిక మేరకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం స్వతంత్ర కుమారి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందిస్తున్నారని తెలిపారు. నాడు–నేడు కింద పాఠశాలలో మెరుగైన మౌలిక వసతులు కల్పించారని చెప్పారు. ఫలితంగా విద్యార్థుల చేరికలు ఎక్కువ అవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం రాజు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం


ఎన్‌టీకేఆర్‌ కాలనీ వాసులతో సచివాలయ సిబ్బంది

నాయుడుపేటటౌన్‌: మున్సిపాలిటీ పరిధిలోని భరత్‌ నగర్‌ సచివాలయంలో శనివారం జరిగిన జగనన్న సురక్షలో తాగునీటి సమస్యను స్థానికులు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దృష్టికి తీసుకొచ్చారు. ఆయన కమిషనర్‌ శ్రీనివాసరావుతో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. సచివాలయ ఇంజినీరింగ్‌ కార్యదర్శి వీవీ చంద్రమోహన్‌, నీటి సరఫరా విభాగం మెకానిక్‌ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నేత అన్నమేటి చంద్రారెడ్డి ఎన్‌టీకేఆర్‌ కాలనీలో స్థానికులతో మాట్లాడారు. నీటి సరఫరా జరగని ప్రాంతాలను పరిశీలించారు. రెండు రోజుల్లో కొత్తగా పైప్‌లైన్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు, అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు ఉత్పత్తి సేవా సంఘాల ఏర్పాటుకు సహకారం


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ, అదానీ ఫౌండేషన్‌ ప్రతినిధులు

చిల్లకూరు: రైతు ఉత్పత్తి సేవా సంఘాల ఏర్పాటుకు అదానీ ఫౌండేషన్‌ సహకారం అందించనుందని మండల వ్యవసాయశాఖాధికారి గూడూరు భవాని తెలిపారు. మండల తీర ప్రాంతంలోని గుమ్మళ్లదిబ్బ సమీపంలోని అదానీ ఫౌండేషన్‌ కార్యాలయంలో తీర ప్రాంతంలోని తమ్మినపట్నం, లింగవరం, గమ్మళ్లదిబ్బ గ్రామాలకు చెందిన రైతులతో సమావేశం నిర్వహించారు. తీర ప్రాంత గ్రామాల్లో ఎక్కువగా సిలికా కలిసిన భూములు ఉన్నందున ఎక్కువగా వేరుశనగ సాగు చేస్తుంటారని తెలిపారు. పంట మార్పిడి చేసుకుంటే మంచి లాభాలు ఆర్జించవచ్చని అన్నారు. ప్రభుత్వంతో పాటు క్రిష్ణపట్నం ఓడరేవుకు చెందిన అదానీ ఫౌండేషన్‌ రైతులకు సహకారం అందించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఫౌండేషన్‌కు చెందిన శాస్త్రవేత్తలు వేరుశనగ సాగులోని మెళకువలను వీడియో ద్వారా వివరించారు. ఫౌండేషన్‌ ప్రతినిధులు రాజేష్‌రంజన్‌, సీహెచ్‌ రమేష్‌బాబు, డాక్టర్‌ సెల్వరాజ్‌, వెంకటేష్‌ పాల్గొన్నారు.

వైద్యుల సేవలు వెలకట్టలేనివి

గూడూరు: భగవంతుడు జన్మనిస్తే.. వైద్యులు పునఃజన్మనిస్తున్నారని, వారి సేవలు వైద్యుల సేవలు వెలకట్టలేనివని ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్‌ అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో శనివారం డాక్టర్స్‌ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులను ఘనంగా సత్కరించారు. కరోనా సమయంలో డాక్టర్లు తమ ప్రాణాలను లెక్క చేయకుండా ప్రజల ప్రాణాలను కాపాడారని కొనియాడారు. అలాంటి వైద్యులను సత్కరించుకోవడం మన కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ షరీనా, సీనియర్‌ వైద్యులు చంద్రహాస్‌ పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌ నిర్మాణం పూర్తి చేయాలని వినతి


ఎమ్మెల్సీకి సమస్యలను విన్నవిస్తున్న మత్స్యకార మహిళలు

గూడూరు: చేపల మార్కెట్‌ నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకార మహిళలు ఎమ్మెల్సీకి విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక సనత్‌నగర్‌లోని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ నివాసంలో ఆయన్ను కలిశారు. తమ సమస్యలను విన్నవించారు. ఐసీఎస్‌ రోడ్డులోని కూరగాయలు, చేపల మార్కెట్‌ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోగా, నూతన మార్కెట్‌ నిర్మిస్తామని చెప్పడంతో ఖాళీ చేశామన్నారు. రెండేళ్లుగా నిర్మాణ పనులు ఆగిపోయాయని.. దీంతో రోడ్లపైనే ఎండకు, వానకు ఇబ్బందులు పడుతూ వ్యాపారాలు చేసుకుంటున్నామని వాపోయారు. త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీని కోరారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎల్లసిరి

గూడూరు: స్ఫూర్తిప్రదాత అల్లూరు ఆదిశేషారెడ్డి అని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో 106 జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. ఎందరో పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందజేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మేనేజింగ్‌ ట్రస్టీ జనార్దన్‌రెడ్డి, రోటరీ క్లబ్‌ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ స్వరూప్‌, శ్రావణ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ లబ్ధి


సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్‌: ప్రతిపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వెంకటగిరి రూరల్‌ మండలం కుర్జాగుంట పంచాయతీలోని అక్బర్‌నివాస కండ్రిగ, పూలరంగడుపల్లి, మన్నేగుంట, కుర్జాగుంట గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రామ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని గ్రామస్తులకు వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో నవరత్నాలతో పాటు మరెన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు నింపారన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి పీఏసీఎస్‌ అధ్యక్షుడు కొండూరు వెంకటరత్నంరాజు, సర్పంచ్‌ రమణయ్య, నాయకులు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, ములవాయిల వెంకటేశ్వర్లు, పెంచలయ్య, శ్రీనివాసులరెడ్డి, నాగయ్య, సదారెడ్డి, బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.